క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్యాపిలి: పట్టణ సమీపంలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అరుణాచల లాజిస్టిక్స్ ఈడీ గణేశన్ సుబ్బారెడ్డి, జీఎం ఆంథోనప్ప పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

బేతంచెర్ల: వాహనదారులు రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాల నిర్మూలనకు సహకరించాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ అన్నారు. బుధవారం పట్టణంతో పాటు గోర్లగుట్ట గ్రామ రహదారిలో అధిక లోడు, రికార్డులు సరిగా లేకుండా వెళ్తున్న వాహనాలు, 5 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి రూ.2,84,000 జరిమానా విధించారు.

పాముకాటుపై అవగాహన కార్యక్రమం

బనగానపల్లె : పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో బుధవారం పాములు, పాముకాటుపై ఫారెస్టు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ అటవీ శాఖ సంఘ మిత్ర అనిమల్ ఫౌండేషన్ హెడ్‌ఆఫ్ వైల్డ్‌లైఫ్ వింగ్ మహమ్మద్ ఇద్రుస్ ఆధ్వర్యంలో హ్యూమన్ స్నేక్‌బైట్ ఎడ్యుకేషన్ కార్యక్రమం జరిగింది. స్థానిక ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రామకృష్ణ, డిప్యూటీ ఫారెస్టు అధికారి సుబ్బయ్య ,ప్రిన్సిపాల్ రామలక్ష్మి పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

బనగానపల్లె రూరల్ : ఉపాధి పనుల్లో రోజువారీ కూలీల సంఖ్యను పెంచాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం రేష్మా, ఈసీ మక్బుల్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి పనులపై టీఏలు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలానికి 150 ఫారంపాండ్స్ కేటాయించామని, రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. కందకాల నిర్మాణం వల్ల వర్షా కాలంలో నీరు నిల్వ ఉండి భూగర్భజలాలు పెరిగుతాయన్నారు. అలాగే ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల పై ప్రజలకు అవగాహన కల్పించి మార్చి చివరిలోపు టీఏ,ఎఫ్ఏలు తమకు కేటాయించిన టార్గెట్‌ను పూర్తి చేయాలని సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బేతంచెర్ల: కార్యకర్తలు పార్టీ పునాది లాంటి వారని, వారికి నిత్యం అండగా ఉంటామని మాజీ మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి బుగ్గానిపల్లె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నాయకులు, కార్యకర్తలను కలిసి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు స్వగృహంలో జరిగిన ఓ శుభకార్యంకు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ వార్డు సభ్యుడు ఖాజా పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: వేసవిలో మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ఆధ్వర్యంలో వచ్చే వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇంజినీరింగ్ అసిసెంట్లు, మెగా కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఉన్న తాగునీటి మోటార్లు, ప్రస్తుతం ఉన్న పరిస్థితిపై చర్చించారు. గ్రామాల్లో భూగర్భజలాలు తగ్గితే అందుబాటులో ఉన్న బోరుబావులను వినియోగంలోకి తీసుకరావాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతోనే రూ.351 కోట్లు వాటర్ గ్రిడ్ పథకం కింద మంజూరయ్యాయన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ పథకం కింద పైపులైన్లు ఏర్పాటు చేయడంతో మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ , వాటర్ గ్రిడ్ పథకం ద్వార గ్రామాలకు తాగునీటి సరఫరా చేయడానికి పైపులైన్ల ఏర్పాటు, పనుల పురోగతిపై మెగా సంస్థ ప్రతినిధులు వివరించారు. బేతంచెర్ల నగర పంచాయతీతో పాటు మండలంలోని 20 గ్రామాలకు రోజుకు 22 గంటల పాటు తాగునీటిని సరఫరా చేస్తామని,13 గ్రామాలకు మార్చి, ఏప్రిల్ నెలలో తాగునీరు అందించడానికి పనులు కొనసాగుతున్నాయని ప్రతినిధులు తెలిపారు. గ్రామాల్లో భూగర్భజలాలు పెంచడానికి ఉపాధి హామీ పథకం కింద ఫారంపాండ్స్, నీటి కుంటల తవ్వకం, చెర్వుల్లో పూడిక తీత పనులు చేపడతామని ఏపీఓ శేషన్న తెలిపారు. జెడ్పీటీసీ శివ లక్ష్మి, ఈఓఆర్డీ మల్లికార్జున, సూపరింటెండెంట్ దస్తగిరిబాబు, వైస్ ఎంపీపీ రంగస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేలాలకు కసరత్తు..

బినామీల గుండెల్లో గుబులు

- కోవెలకుంట పంచాయతీ షాపింగ్ కాంప్లెక్సులో 98 దుకాణాలు
- 25 ఏళ్లుగా వేలంపాటలు నిర్వహించని వైనం
- ఏళ్ల తరబడి షాపులను తమ ఆధీనంలో ఉంచుకున్న దళారులు
- త్వరలో కాంప్లెక్స్‌ల వేలాలు నిర్వహించేందుకు కసరత్తు
- ఈ ఆర్థిక సంవత్సరంలోనే నిర్వహించే అవకాశం



కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ ఆదాయానికి ప్రధాన ఆర్థిక వనరైన షాపింగ్ కాంప్లెక్స్‌లను బహిరంగ వేలాల ద్వారా బాడుగకు ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వేలాల నిర్వహణతో ఏళ్ల తరబడి షాపులను తమ ఆధీనంలో ఉంచుకున్న దళారుల దందాకు చెక్ పడనుంది. వేలాల నిర్వహణకు మార్గం సుగమం కావడంతో బినామీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

వివిధ ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు

మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మెయిన్‌రోడ్డు, పోలీస్ సర్కిల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ రోడ్ ఇండోర్ స్టేడియం, తదితర ప్రాంతాల్లో 98 షాపులు ఉన్నాయి. కొన్ని ఏళ్ల నుంచి ఈ షాపుల్లో కిరాణా, వస్త్ర, మెకానిక్, కూల్‌డ్రింక్స్, టిఫిన్, భోజన హోటళ్లు, బంగారు, బుక్, ఫ్యాన్సీ, తదితర షాపులు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాయీబ్రాహ్మణులు, టైలర్లు, రజకులు తదితర కులాలవారు కులవృత్తులు చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకొకసారి షాపుల నిర్వహణకు వేలాలు చేపట్టాల్సి ఉంది. వివిధ కారణాలతో గత 25 సంవత్సరాల నుంచి వేలంపాట జరగలేదు. ప్రతి ఏటా అప్పటి వరకు చెల్లిస్తున్న బాడుగకు అదనంగా కొంత శాతం పెంచి ఈ ఏడాది వరకు బాడుగలు చెల్లిస్తున్నారు.

దాదాపు 50 దుకాణాలు బినామీల గుప్పిట్లో

గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌ల వేలాలకు అధికారులు కసరత్తు జరుగుతుండటంతో దళారుల ఆదాయానికి గండి పడనుంది. బినామీ పేర్లతో గతంలో దాదాపు 50 షాపులు దక్కించుకున్న వ్యక్తులు ఆ షాపుల్లో వ్యాపారాలు నిర్వహించకుండా ఇతర వ్యక్తులకు అప్పగించి గుడ్‌విల్ రూపంలో లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. ఒక్కో షాపునకు రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలు గుడ్‌విల్ రూపంలో తీసుకోవడంతోపాటు ఏళ్ల తరబడి ప్రతి నెలా బాడుగ రూపంలో వేలాది రూపాయలు తీసుకుంటూ గ్రామ పంచాయతీ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. దళారులు రూ. 12వేల నుంచి రూ. 15వేల వరకు బాడుగలు వసూలు చేసుకుంటూ గ్రామ పంచాయతీకి మాత్రం రూ. 3 వేల నుంచి రూ. 7 వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్‌లను దక్కించుకుని సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్న వారి వివరాలు, దళారులు దక్కించుకున్న ఉన్న షాపుల వివరాలు సేకరించడంతో దళారుల్లో గుబులు రేపుతోంది.

2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి అమలు

గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లకు 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచే వేలం పాటలు నిర్వహించనున్నారు. వేలాల్లో షాపులు దక్కించుకున్న వ్యక్తులు మూడు సంవత్సరాల పాటు షాపుల్లో వ్యాపారాలు చేసుకునేలా అనుమతి ఉంటుంది. అయితే షాపులన్నింటినీ వేలం వేస్తారా, బినామీల షాపులను మాత్రమే వేలం వేస్తారా అనే చర్చ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా సొంతంగా షాపులు దక్కించుకుని ఏళ్ల తరబడి ఆ షాపుల్లో కులవృత్తులు చేసుకునే వారికి వేలాల నుంచి మినహాయింపు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాంటి వ్యక్తులకు ప్రస్తుతం చెల్లిస్తున్న బాడుగకు కొంత మొత్తాన్ని పెంచి తిరిగి వారికే ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. మిగిలిన షాపులకు త్వరలో వేలం పాట నిర్వహించి వచ్చే నెల నుంచి షాపుల నిర్వహణ జరిగే అధికారులు దృష్టి సారించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు చోటు చేసుకోకుండా వేలాల ప్రక్రియ సజావుగా కొనసాగితే బినామీలకు ప్రతి ఏటా వచ్చే ఆదాయానికి ఫుల్‌స్టాఫ్ పడనుంది. కులవృత్తులతోపాటు సొంతంగా షాపులు దక్కించుకుని వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులకు వేలాల నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

బేతంచెర్ల: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యవర్గ సభ్యుడు సుంకయ్య అన్నారు. బుధవారం మండలంలోని అంబాపురం గ్రామంలో పేదలకు ఇంటి స్థలం కోసం భూ పోరాటంలో భాగంగా గ్రామ పురవీధుల్లో ర్యాలీగా వెళ్లి గ్రామ సమీపంలో నున్న ప్రభుత్వ భూమిని గుర్తించి ఎర్ర జెండాలను పాతారు. సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శివయ్య పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు విరివిగా రుణాలు

బనగానపల్లె రూరల్ : బ్యాంకుల ద్వారా పొదుపు సంఘాలకు విరివిగా రుణాలు ఇవ్వడం జరుగుతుందని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో ఉమ్మడి మండల స్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశించిన ప్రకారం డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.4 కోట్ల రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయన్నారు. మహిళలు తీసుకున్న రుణాలను జీవనోపాధుల అభివృద్ధికే ఉపయోగించుకునేలా వెలుగు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటరమణ, ఏరియా కో ఆర్డినేటర్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో లోతు దుక్కులు శ్రేయస్కరం



మాట్లాడుతున్న ఏఓ సుధాకర్ రెడ్డి

సంజామల: పండించిన పంట పూర్తయిన వెంటనే లోతైన దుక్కులు దున్నించడం శ్రేయస్కరమని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. లోతుదుక్కుల ద్వారా వర్షపు నీరు ఎక్కువగా ఇంకి, పైర్లు వేసినప్పుడు వేర్లు లోపలికి చొచ్చుకుని పోయి పోషకాలు గ్రహించే శక్తి వస్తుందన్నారు. మండల పరిధిలోని ముదిగేడు గ్రామ సచివాలయంలో రైతులతో బుధవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లడుతూ.. ప్రతి సంవత్సరం ఒకే రకమైన పంట వేయకుండా పంట మార్పిడి చేయడం వలన అనేక లాభాలు ఉన్నాయన్నారు. పంట వ్యర్థపదార్థలను కాల్చకుండా అలాగే భూమిలో సేద్యం చేయడం ద్వారా పంట దిగుబడి పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు నరసింహారెడ్డి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వెచ్చించాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి చెప్పారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను బుధవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2011వ సంవత్సరం నుంచి ప్రతి నెల పేదలకు తమ వంతు సాయంగా పింఛన్లు అందజేస్తున్నామన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణానికి చెందిన దస్తగిరి తన వంతు సాయంగా మరో పది మందికి ఈ నెల ఫించన్ రూపంలో నగదు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, ప్రకృతి పీఠం సభ్యులు శ్రీనివాసరెడ్డి, మహేశ్వరరెడ్డి, రాములమ్మ, నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు చిత్రలేఖన పోటీలు



విద్యార్థినులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురికి బహుమతులకు ఎంపిక చేశారు. ఈ నెల 8న విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి



అవుకు బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న డిప్యూటీ విద్యాధికారి వెంకట రామిరెడ్డి

అవుకు: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని డిప్యూటీ విద్యాధికారి ఎస్ వెంకట రామిరెడ్డి సూచించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, సెయింట్ మేరిస్ స్కూల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాతూ ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ప్రతి పరీక్ష కేంద్రంలోనూ తాగునీటి వసతి, కరెంట్ బల్బులు, ఫ్యాన్లు, బల్లలు, ఇతరాత్రా వసతులు సక్రమంగా ఉండాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. పరీక్షలు సమీపిస్తున్నాయని విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా తగు సలహాలు, సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1,2 శ్రీధర్ రావు, వెంకటేశ్వర రెడ్డి, హెచ్‌ఎంలు శింగయ్య, చెన్నకేశ్వరి పాల్గొన్నారు.

కల నెరవేరింది





తల్లిదండ్రులతో పాటు అవ్వ ఆశీర్వాదం తీసుకుంటున్న ఎస్ఐ సుభహాన్

బనగానపల్లె రూరల్ : మండలంలోని బీరవోలు గ్రామానికి చెందిన వ్యసాయ కూలీ పనులు చేస్తుకుటుంబాన్ని పోషించుకుంటున్న మొల్లా షరిఫ్, మొల్లా సోఫియా దంపతుల కుమారుడు మొల్లా సుభహాన్ ఎస్ఐ ట్రైనింగ్ పూర్తి చేసుకోవడంతో ఆ కుటుంబంలో ఆనందం నెలకొంది. మొల్లా సుభహాన్ ఎస్ఐ శిక్షణ పూర్తి చేసుకొని ఇటీవల స్వగ్రామం బీరవోలు గ్రామంలోని ఇంటికి చేరుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొల్లా సుభాహాన్‌కు మొదటి నుంచి ఎస్ఐ కావాలనేదే లక్ష్యం. అతని తన ప్రాథమిక విద్య 1–5వ తరగతి వరకు బీరవోలు ఎంపీపీ పాఠశాల, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పూర్తి చేసి, ఇంటర్, డిగ్రీ నంద్యాలలో పూర్తి చేశాడు. పోలీసు నియామకం 2018 ద్వారా ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి, అనంతపురం బెటాలియన్‌లో ఉద్యోగంలో చేరాడు. ఎస్ఐ కావాలనే పట్టుదలతో ఉద్యోగం చేస్తూనే ఎస్ఐ పోస్టుల నియామకానికి 2023 పరీక్షరాసి ఎంపికయ్యాడు. ఎస్ఐగా అనంతపురం పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకోగా.. ఎస్ఐగా వైఎస్సార్ జిల్లాలో పోస్టింగ్ పొందాడు. ట్రైనింగ్ పూర్తి చేసుకొని తల్లిదండ్రులతో పాటు అవ్వ ఆశీర్వాదం తీసుకొవడంతో వారి ఆనందానికి హద్దులులేవు.

నేడు మంచినీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : వెంకటాపురం రోడ్డులోని పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న ఫిల్టర్ హౌస్ ప్లాంట్ నిర్వాహణ మరమ్మతుల కారణంగా గురువారం మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

జయప్రదం చేయండి

డోన్ టౌన్ : కాటికాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 11వ తేదీ విజయవాడలో జరగనున్న బహిరంగ సభకు కాటికాపరులు తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొయిలకొండ నాగరాజు బుధవారం పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం చిన్నమల్కాపురం గ్రామంలో విడుదల చేశారు. గార్లపాటి తిరుపాలు,శేషముని,మధుబాబు,శేఖర్,పాపరాయుడు, నాగశేషు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గృహాలకు అదనపు బిల్లు

కోవెలకుంట్ల: పక్కాగృహాలు మంజూరైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు బిల్లు చెల్లిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో వచ్చే బిల్లుతోపాటు ఎస్సీ కేటగిరిలో ఒక్కో లబ్ధిదారునికి రూ. 50 వేలు, ఎస్టీ కేటగిరిలో రూ. 75 వేలు, బీసీ కేటగిరిలో చేనేత లబ్దిదారులకు రూ. 50 వేల చొప్పున అదనంగా బిల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్దిదారులు కుల ధ్రువీకరణ పత్రాలను స్థానిక హౌసింగ్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

పిల్లల సంరక్షణ బాధ్యత తల్లిదే

బనగానపల్లె : పిల్లల సంరక్షణ బాధ్యత తల్లిదే అని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని 6వ అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు ఈసీసీఈ డే కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ తక్కువ బరువు ఉండడం వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని, బరువు తగ్గకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదేనన్నారు. గర్భిణులుగా ఉన్నప్పుడు పౌష్టికాహారం తీసు కోవడం వల్ల సంపూర్ణమైన ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ రమాదేవి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

యాగంటిలో జేసీ దంపతులు



జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ దంపతులకు స్వామి వారి చిత్ర పటం అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. జాయింట్ కలెక్టర్ దంపతులకు ఆలయ ఈఓ చంద్రుడు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం జేసీ దంపతులను దుశ్శాలువా, పూలమాలతో సన్మానించి స్వామివారి చిత్ర పటం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండిమౌలీశ్వర రెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



సీహెచ్‌సీలో కాన్పుల వార్డును పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా

బేతంచెర్ల: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా అన్నారు. బుధవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలతో పాటు, కాన్పుల వార్డు, సాధారణ వార్డులోని మరుగుదొడ్లను పరిశీలించారు. రోగులకు వైద్య సేవలతో పాటు మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఓపీ రాయింకునే స్థలంవద్ద వృద్ధులు నిలబడకుండా కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీహెచ్‌సీ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు.

డస్ట్‌బిన్‌లకు మరమ్మతులు

డోన్: మున్సిపల్ పరిధిలో అవసరమైన చెత్తకుండీలు ఏర్పాటు చేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు.స్థానిక పారిశ్రామిక శిక్షణ సంస్థలో డస్టుబిన్‌లకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. విద్యార్థులు తమ శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాడైపోయిన డస్ట్‌బిన్‌లకు మరమ్మతులు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు 23 డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, డీఈ రఘు, ఏఈ సురేష్ ఉన్నారు.

వారి ఫొటోలను తొలగించడం దారుణం

బేతంచెర్ల : ఢిల్లీ సీఎం కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్, భగత్‌సింగ్ ఫొటోలను తొలగించడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు బొల్లి మద్దిలేటి, రామసుబ్బయ్య నిరసన తెలిపారు.